RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 322 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శనివారం, 25 మే 2024 పేజీలు : 4 వెల : 2/-

# నేడే ఆరో విడత

## ఎన్నికల ప్రక్రియకు సర్వం సిద్ధం



న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా జూన్ 1వ రకు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్న లోక్ సభ ఎన్నికల్లో ఇప్పటికే 5 దశలు పూర్తైన సంగతి తెలిసిందే. ఆరో దశ ఎన్నికలు శనివారం (మే 25) జరగనున్నాయి. ఆరో దశ లోక్‌సభ ఎన్నికలు దేశ రాజధాని ఢిల్లీతో సహా మొత్తం 6 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో 58 నియోజకవర్గాలకు జరగనున్నాయి. బీహార్ 8 సీట్లు, హర్యానా 10 సీట్లు, జమ్మూ కాశ్మీర్ 1 సీటు, జార?ండ్ 4 సీట్లు, ఢిల్లీ 7 సీట్లు, ఒడిశా 6 సీట్లు, ఉత్తరప్రదేశ్ 14 సీట్లు, పశ్చిమ బెంగాల్ 8 సీట్లకుగానూ.. మొత్తం 889 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. లాజిస్టికల్, కమ్యూనికేషన్ అండ్ కనెక్టివిటీకి సంబంధించి అడ్డంకుల కారణంగా గత నెలలో ఎన్నికల సంఘం జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి పోలింగ్ తేదీని మే 7 నుంచి మే 25 మార్చింది. ఇక రేపు జరగనున్న ఆరో దశ ఎన్నికలకు ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. మే 25న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 6వ దశ ఎన్నికలకు ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 14 పార్లమెంటరీ నియోజకవర్గాల నుంచి 470, హర్యానాలో 10 నియోజకవర్గాల నుంచి 370 నామినేషన్లు వచ్చాయి. ఈ దశలో ఒక్కో పార్లమెంటరీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థుల సగటు సంఖ్య 15 అని పోల్ బాడీ పేర్కొంది. ఏడు దశల ఎన్నికలు పూర్తైన తర్వాత జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇక అదే రోజు ఫలితాలను కూడా ప్రకటించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తుంది.

**లోక్ సభ 2024 ఆర దశ ఎన్నికలు జరగనున్న నియోజకవర్గాల పూర్తి జాబితా ఇదే..**

**ఢిల్లీ (కేంద్రపాలిత ప్రాంతం) –** చాందినీ చౌక్, ఈశాన్య ఢిల్లీ, తూర్పు ఢిల్లీ, న్యూఢిల్లీ, వాయువ్య ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ

**హర్యానా –** అంబాలా, కురుక్షేత్ర, సిర్సా, హిసార్, కర్నాల్, సోనిపట్, రోహ్తక్, భివానీ-మహేంద్రగఢ్, గుర్గావ్, ఫరీదాబాద్

**ఉత్తర ప్రదేశ్ –** సుల్తాన్‌పూర్, ప్రతాప్‌గఢ్, ఫుల్పూర్, అలహాబాద్, అంబేద్కర్ నగర్, శ్రావస్తి, దోమ్రియాగంజ్, బస్తీ, సంత్ కబీర్ నగర్, లాల్‌గంజ్, అజంగఢ్, జౌన్‌పూర్, మచ్లిషహర్, భదోహి

**పశ్చిమ బెంగాల్ –** తమ్లుక్, కంఠి, ఘటల్, ఝర్‌గ్రామ్, మేదినీపూర్, పురూలియా, బంకురా, బిష్ణుపూర్

**జారండ్ –** గిరిడి, ధన్‌బాద్, రాంచీ, జంషెడ్‌పూర్

**బీహార్ –** వాల్మీకి నగర్, పశ్చిమ్ చంపారన్, పూర్వి చంపారన్, షెయోహర్, వైశాలి, గోపాల్‌గంజ్, శివన్, మహారాజ్‌గంజ్

**జమ్మూ – కాశ్మీర్ (కేంద్రపాలిత ప్రాంతం) –** అనంతనాగ్-రాజౌరి

**ఒడిశా –** భువనేశ్వర్, పూరి, ధెంకనల్, కియోంజర్, కటక్, సంబల్పూర్

## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక...

### పోలింగ్ రోజు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు: ఈసీ

హైదరాబాద్: ఈనెల 27న ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయ శంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, సిద్దిపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ,



సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సీఎల్ ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రైవేటు ఉద్యోగులకు సెలవు ఇవ్వాలని చట్టంలో లేనందున తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో సూచించారు. ప్రైవేటు కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ సిబ్బంది ఓటు వేసేందుకు వీలుగా షిఫ్టులు సర్దుబాటు లేదా ఆలస్యంగా వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## 400 సీట్లు ఎందుకివ్వాలి?

### బీజేపీపై సామాజిక ఉద్యమకారుల యుద్ధం!



ప్రస్తుతం దేశంలో జరుగుతున్నసార్వత్రిక ఎన్నికల పోలింగ్(ఇప్పటి వరకు ఐదు దశలు జరిగాయి. మరో రెండు దశల పోలింగ్ జరగాల్సి ఉంది) ప్రక్రియలో ఊరూ వాడా .. బీజేపీ నేతలు.. తమకు 400 సీట్లు రావాలని.. ఇవ్వాలని కూడా..ప్రచారం చేస్తున్నారు. ఇది వస్తే.. దేశ గతిని మార్చేస్తామని కూడా చెబుతున్నారు. "ఇప్పటి వరకు మీరు(ప్రజలు) చూసింది ట్రైల్ మాత్రమే.. అసలు కథ ముందుంది" అని ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నారు. ఇక, కేంద్ర మంత్రి , బీజేపీ అగ్రనేత అమిత్ షా కూడా..ఇదే చెబుతున్నారు. తమకు 400 సీట్లు వస్తే.. పీవోకేను భారత్‌లో కలిపేస్తామని.. యూసీపీ(ఉమ్మడి పౌరస్మృతి)ని అమలు చేస్తామని అంటున్నారు. మొత్తంగా చూస్తే.. తమకు 400 స్తానాలు కావాలని కమల నాథులు కోరుతున్నారు. ఇక, ఇదే విషయాన్ని కాంగ్రెస్ నేతలు.. ఇండియా కూటమి సభ్యులు కూడా ప్రస్తావిస్తూ.. ఇదే జరిగితే.. అంటే బీజేపీకి 400 స్థానాలు కట్టబెడితే.. రాజ్యాంగాన్ని మార్చేస్తా రని, తద్వారా.. రిజర్వేషన్లుపోతాయని. ముస్లింలు పొరుగు దేశాలకు వెళ్లి తలదాచుకునే పరిస్థితి వస్తుందని చెబుతున్నారు. వీరి ప్రచారంలో బీజేపీ దూకుడు ముందు ఇండియా కూటమి... కాంగ్రెస్ పార్టీలు చేస్తున్నవి పెద్దగా ప్రజల మధ్యకు చేరడం లేదనే ఉంది.

ఈ నేపథ్యంలో తాజాగా సామాజిక ఉద్యమకారులు.. రోడ్డెక్కారు. వీరిలో ప్రముఖులు మేధాపాట్కర్, అరుణ్ రాయ్ వంటి వారు కూడా ఉన్నారు. 400 సీట్లు బీజేపీకి ఎలా వస్తాయని..ఎందుకు వస్తాయని.. ఎందుకు ఇవ్వాలని వీరు ప్రశ్నల పరంపర ఎక్కు పెట్టారు. కొన్ని మీడియా చానెళ్లకు ఎన్నికలకు ముందుగానే వీరు ఇచ్చిన ఇంటర్వ్యూలను ప్రచారం కాకుండా.. ప్రసారం కాకుండా కూడా.. తొక్కి పెట్టినట్టు తెలిసింది. అయితే.. వీటికి సంబంధించిన కొన్ని విషయాలు బయటకు వచ్చాయి. ప్రధానంగా వీటిలో రెండు కోణాలను ఉద్యమకారులు ప్రస్తావించారు. స్వేచ్ఛాయుత వాతావరణానికి బీజేపీ ప్రభుత్వంలో అడ్డుకట్ట పడిందని.. రచయితలు.. మేధావులను కూడా అణిచేశారని వీరు చెబుతున్నారు. ఇక, ధరలు.. సామాన్యులపై మోపిన భారాలను వీరు ప్రస్తావిస్తున్నారు. వీటిని ప్రాతిపదికగా చేసుకుని.. గడిచిన ఎన్డీయే 10 ఏళ్లపాలనను కూడా.. వీరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దేశంలో 12 మంది రచయితలు.. హత్యకు గురయ్యారని తెలిపారు. అదేవిధంగా ఉద్యమకారులైన.. వరవరరావు, ప్రొఫెసర్ సాయిబాబా వంటి వారిని వందల మందిని అరెస్టు చేసి జైలు పాలు చేశారని చెబుతున్నారు. ఇందుకోసమేనా 400 సీట్లు ఇవ్వాలి ? అనేది వీరి ప్రశ్న. మరోవైపు.. సామాన్య జనాలపై ధరల భారం మోపారని చెబుతున్నారు.

పుట్టిన దగ్గర నుంచి చచ్చేవరకు మధ్య ప్రతిదీ జీఎస్టీతో ముడిపడిన విషయాన్ని ఎత్తి చూపారు. ఇందుకోసమేనా.. బీజేపీకి 400 సీట్లు ఇవ్వాలని నిలదీస్తున్నారు. అయితే.. వీరి విషయాలను.. వాదనలను ప్రధాన మీడియా స్రవంతులు ప్రసారం చేయకపోవడం గమనార్హం.




హైదరాబాద్ : తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాల్లో ఎవరు విజయం సాధించబోతున్నారు. ఓటరు ఎటువంటి తీర్పు ఇవ్వబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లోనూ 14 సీట్లు గెలవాలని టార్గెట్‌గా పెట్టుకుంది. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీలను అమలుచేస్తున్నామని.. తమకే ఓట్లు పడతాయని కాంగ్రెస్ నేతలు అంచనావేశారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ బలహీనపడటం తమకు కలిసివస్తుందని భావించారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలే కావడంతో తమ ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత ఉండదని హస్తం పార్టీ నేతలు లెక్కలు కట్టారు. ఓటింగ్ జరిగిన తీరు చూసిన తర్వాత కాంగ్రెస్ నేతల్లో టెన్షన్ మొదలైందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఓటు వేసినవారిలో దాదాపు 20 నుంచి 30 శాతం మంది బీజేపీకి ఓటు వేశారని.. మరోవైపు బీఆర్ఎస్ ఓటు కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీకే ఎక్కువగా బదిలీ అయినట్లు లెక్కలు అందుతున్నాయట. దీంతో 8 సీట్లలో అయినా గెలుస్తామా లేదా అనే అనుమానంలో కాంగ్రెస్ నేతలు ఉన్నారట. మరోవైపు 2019లో గెలిచిన నాలుగు సీట్లకు అదనంగా ఎన్ని గెలిచినా బోనస్‌గా వచ్చినట్లేనని బీజేపీ నేతలు భావిస్తున్నారట. ఎన్నికల ముందు డబుల్ డిజిట్ సాధిస్తామని కమలం నేతలు చెప్పినా.. ఆరు నుంచి 8 సీట్లు తప్పనిసరిగా గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారట. ఎన్నికల పోలింగ్ ముగిసన తర్వాత పోలింగ్ సరళి.. పార్టీ శ్రేణుల నుంచి అందుతున్న నివేదికల తర్వాత బీజేపీ డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తుందనే నమ్మకం పార్టీ నేతల్లో పెరిగిందట. కనీసం రెండు నుంచి మూడు సీట్లలో అయినా గెలవాలని భావించిన బీఆర్ఎస్ నేతలు తీవ్ర నిరాశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ఒక సీటు అయినా గెలుస్తామా లేదా అని గులాబీ నేతలు టెన్షన్ పడుతున్నారట.

## చివరిలో ఓటరు మూడ్ మారిందా?

### తెలంగాణలో మెజార్టీ సీట్లు ఆ పార్టీవేనా..?

**ఓటరు మూడ్ మారిందా..** తెలంగాణలో ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది. నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మరోసారి కేంద్రంలో మోదీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ ప్రచారం చేస్తే.. హస్తం పార్టీ అధికారంలోకి వస్తే ఓ వర్గానికి ఆస్తులు పంచేస్తారంటూ బీజేపీ ప్రచారం చేశాయి. మరోవైపు హిందువలును పోలరైజ్ చేసేందుకు కమలం పార్టీ ప్రయత్నించింది. మొదట్లో హిందువుల ఓట్లు ఏకమవుతాయని ఎవరూ ఊహించలేదు. తెలంగాణలో ఆ పరిస్థితి లేదని అన్ని పార్టీలు భావించాయి. అదే సమయంలో బీజేపీకి వ్యతిరేకంగా ముస్లింల ఓట్లు తమకు పడేలా కాంగ్రెస్ వ్యూహం రచించింది. ఈ విషయాన్ని ఎంఐఎం అధినేత ఓవైసీ బహిరంగంగానే చెప్పారు. ఎంఐఎం పోటీలోలేని 16 స్థానాల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు ఓటేయ్యాలని పరోక్షంగా చెప్పారు. ఇది ఇప్పుడు బీజేపీకి కలిసొచ్చిందనే ప్రచారం జరుగుతోంది. ముస్లింల ఓట్లు పోలరైజ్ అవుతున్నప్పుడు హిందువులంతా ఐక్యంగా ఓటేయ్యాలని గ్రామాల్లోని ఓటర్లు నిర్ణయించుకున్నారనే చర్చ జరుగుతోంది. అందుకే చివరిలో మారిన ఓటరు మూడు.. కాంగ్రెస్‌కు నష్టం కలిగించే అవకాశం లేకపోలేదనే చర్చ జరుగుతోంది. బీజేపీ మాత్రం సైలెంట్ ఓటింగ్ తమకు కలిసి వచ్చిందని.. తాము ఊహించిన సీట్లకంటే ఎక్కువ స్థానాల్లో గెలుస్తామని బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆశలు లేని పెద్దపెల్లి స్థానంలో కాషాయజెండా ఎగురుతుందంటూ బీజేపీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి స్థానంలో బీజేపీ గెలిచే అవకాశాలు ఉంటే ఆ పార్టీ 10 సీట్లు గెలిచే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**బీఆర్ఎస్ ఓటు ఎటు..** బీజేపీకి గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా బలం లేకపోయినప్పటికీ డబుల్ డిజిట్ సాధిస్తామని ఆ పార్టీ నేతలు ధీమాగా ఉండటానికి ప్రధాన కారణం బీఆర్ఎస్ ఓట్లు తమకు బదిలీఅయ్యాయనే ఒకే ఒక ఆశ. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సీఎం రేవంత్ టార్గెట్ చేయడంతో.. ఎలాగైనా కాంగ్రెస్‌ను ఓడించాలనుకున్న బీఆర్ఎస్ శ్రేణులు తమ ఓట్లను బీజేపీకి వేయడంతో పాటు.. పార్టీ కార్యకర్తలు, అభిమానులతోనూ బీజేపీకి ఓటు వేయించారనే ప్రచారం జోరుగా సాగుతోంది. లోక్‌సభ ఎన్నికలు కేంద్రానికి సంబంధించిన ఎన్నికలు కావడం, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచినా పెద్ద ఉపయోగం లేదని భావించిన ఓటర్లు ఆ ఓట్లను బీజేపీకి వేశారనే చర్చ నడుస్తోంది. నిజంగా బీఆర్ఎస్ ఓటు బీజేపీకి బదిలీ అయిందా లేదా అనేది జూన్4న తేలనుంది. ఓటరు మూడ్ ఎలా ఉంది.. ఎవరికి ఎక్కువ సీట్లు ఇవ్వనున్నారనేది ఓట్ల లెక్కింపు రోజు బయటపడనుంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## అధికారంలోకి వస్తే...

## కొత్త బాబునే చూస్తారా ?

టీడీపీ అధినేత బాబు తన రాజకీయ జీవితంలో తల పండిన వారే. కానీ ఆయన 2019 నుంచి 2024 మధ్య అయిదేళ్ల కాలంలో నేర్చుకున్నంతగా తన మొత్తం పొలిటికల్ లైఫ్ లో నేర్చుకోలేదు అని అంటూంటారు. అది స్వపక్షం విషయంలో కానీ అలాగే అధికార పక్షం వైపు నుంచి వచ్చే దాడులు గురించి కానీ ఆయన నెవర్ బిఫోర్ అన్నంతగా అనుభవాలను అందుకున్నారు అని అంటున్నారు. ఒక్కసారి అధికారం చేజారితే అంతకు ముందు అయిదేళ్ళ పాటు పదవులు రుచి చూసి ఆసాంతం అనుభవించిన వారు సైతం ఎలా తెర చాటుకు పోతారో బాబు స్వయంగా చూశారు. 151 సీట్లతో వైసీపీ అధికారంలోకి వచ్చి మొదటి మూడేళ్ళూ దూకుడు చేస్తే బడా నాయకుల నుంచి సీనియర్లు అత్యధిక శాతం బయటకు రాని నేపథ్యాన్ని ఆయన చూసారు అని అంటున్నారు. ఇలా సొంత పార్టీ వారు చేదు నిజాలు చెబితే అధికారం చేతిలో ఉంచుకుని విపక్షాన్ని ఎంతలా కట్టడి చేయగలరో అది హద్దులు ఎంతలా మీరుతుందో కూడా బాబు కళ్ళారా చూసారు. రాజకీయాన్ని రాజకీయంగానే బాబు ఇప్పటిదాకా చేస్తూ వచ్చారు. కానీ 2019 నుంచి ఆయన చూసిన రాజకీయమే వేరు అని అంటున్నారు. అందుకే ఆ అనుభవాల సారం నుంచి ఆయన ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు అని అంటున్నారు. దాంతో ఈసారి టీడీపీ అధికారంలోకి వస్తే కొత్త బాబునే చూస్తారు అని అంటున్నారు. గతంలో చాలా సార్లు ఈ మాట అన్నా ఈసారి ఆయన అది నిజం చేస్తారు అని అంటున్నారు. నిజానికి చంద్రబాబు ఎన్నికల సమయంలోనే చాలా మందికి టికెట్లు నిరాకరించాలని చూసారు. చివరి నిముషంలో వచ్చిన ఒత్తిళ్ళు గెలుపు అనివార్యం కావడం చేత కొంత రాజీ పడ్డారు అని అంటారు. అయితే అధికారం చేతిలోకి వచ్చాక మాత్రం ఆయన తనదైన శైలిలోనే నిర్ణయాలు తీసుకుంటారు అని అంటున్నారు. దానికి నాందిగా ఆయన మార్క్ మంత్రివర్గం కూర్పుతోనే మొదలవుతుంది అని అంటున్నారు. ఈసారి చంద్రబాబు మంత్రులలో అత్యధిక శాతం యువత కొత్త వారు ఉంటారు అని అంటున్నారు. ఆయా జిల్లాల నుంచి ఎన్నడూ పదవులు దక్కించుకోని వారు ఫ్రెష్ లుక్ ఉన్న వారికే ఇస్తారు అని అంటున్నారు. సీనియర్లు అనేక సార్లు మంత్రులుగా అయిన వారికి మాత్రం పక్కన పెట్టేస్తారు అని అంటున్నారు. ఆ విధంగా చూస్తే మంత్రి పదవులను మరోసారి అనుభవించాలని ఉవ్విళ్ళూరుతున్న బడా నాయకులకు మాత్రం బాబు మార్క్ షాక్ తప్పదని అంటున్నారు. పార్టీ పటిష్టతతో పాటు మరింత కాలం టీడీపీ మనుగడ సాగించేలా బాబు నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు. అలాగే ఆయన సామాజిక సమీకరణలను కూడా సరిచూసుకుంటూ వినూత్న నిర్ణయాలకు ఆస్కారం ఇస్తారని అంటున్నారు. ఇక చంద్రబాబు సైతం దూకుడు రాజకీయానికి తెర తీస్తారని ఏపీలో గతంలో ఎన్నడూ చూడని విధంగా బాబు పాలన సాగే అవకాశం ఉంటుందని అంటునారు. మొత్తం మీద చూస్తే బాబు మంత్రి వర్గం లో చేరాలని చాలా మంది ఆశలు పెట్టుకుని ఉండవచ్చు. కానీ ఆయన మాత్రం చాలా దూర దృష్టితో కొత్త ఆలోచనలతోనే ముందుకు పోతారు అని అంటున్నారు. టికెట్ల జారీలోనే బాబు ఆలోచనలు ఏమిటి అన్నది కొంత వెలుగులోకి వచ్చింది. సీనియర్లు అనుకున్న వారిని చివరి వరకూ టెన్షన్ లో పెట్టడం ద్వారా తానేంటో చెప్పిన బాబు అధికారం దక్కాక తనదైన శైలిని కూడా అమలులోకి పెడతారు అని అంటున్నారు. మొత్తానికి ఈసారి టీడీపీ క్యాబినెట్ లో కొత్త ముఖాలకే చాన్స్ ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

# గాబరా పెడుతూ.. నాసివి అంటగడుతూ..



వికారాబాద్: తొలకరి ఇంకా ప్రారంభం కాలేదు. అప్పుడే కొందరు విత్తన వ్యాపారులు అన్నదాతలను పరుగులు పెట్టిస్తున్నారు. పత్తి విత్తనాల కోసం రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని కృత్రిమ కొరతకు తెర తీస్తున్నారు. పేరెన్నిక గల కంపెనీల విత్తనాలు దొరకడం లేదని ముందుగానే కొని దగ్గరుంచుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అమాయక రైతులు విత్తనం నాసి రకమా, నాణ్యత కలిగిందా అనే విషయం కూడా గమనించలేక కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు అప్రమత్తమై తనిఖీలు ముమ్మరం చేయాల్సిన అవసరాన్ని పేర్కొంటూ కథనం.

### మద్దతు ధర కలిసి వస్తుందని ఆశ

నాలుగేళ్ల అనుభవాల దృష్ట్యా ఈ వానాకాలం సీజన్‌లో అత్యధికంగా పత్తి పంట వేయడం వైపే జిల్లా రైతులు మొగ్గు చూపుతున్నారు. పత్తి క్వింటాలు ప్రభుత్వ మద్దతు ధర రూ.6,080 ఉండటం, బహిరంగ విపణిలో ధర రూ.6,500 పైచిలుకు పలకడంతో అధిక శాతం రైతులు పత్తి సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. 2022లో జిల్లాలో దిగుబడి తగ్గినా గరిష్ఠంగా పత్తి క్వింటాలుకు రూ.9,500 అమ్ముడుపోయింది.

### పొంచిఉన్న బీటీ -3 బెడద

రైతుకు కావాల్సినవి లభించకపోవడంతో బీటీ -3 విత్తనాల బెడద పొంచి ఉంది. కలుపు పెద్దగా ఉండదని పురుగు మందుల ఖర్చులు తగ్గుతాయని ప్రచారం చేయడంతో గతేడాది కర్నూలు, రాయలసీమ, ఆంధ్రా ప్రాంతం నుంచి కూడా వివిధ గ్రామాలకు పంపిణీ అయ్యాయి.

### అసలు రూ.864.. విక్రయం.. రూ.2,000

జిలాలలో ఒక్కో ప్యాకెట్ పత్తి విత్తన ధర వాస్తవానికి రూ.864 ఉండగా రూ.1500 నుంచి రెండువేలకు పైగా విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ డివిజన్ల పరిధిలో 523 మందికి విత్తన లైసెన్సులు ఉన్నాయి.

### పట్టుకుంటున్నా కనిపించని మార్పు

అధిక ధరలకు పత్తి విత్తనాలు అమ్మడం, కొన్నిచోట్ల నాసిరకం విక్రయించడంతో అధికారులు తనిఖీల్లో ప్రతిసారీ కేసులు నమోదవుతున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖకు దౌల్తాబాద్, కొడంగల్, యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ ప్రాంతాల్లో పట్టుబడిన నాసిరకం విత్తన ఉదంతాలే ఇందుకు తాజా ఉదాహరణ. సుమారు రూ.36లక్షల విలువ చేస్తే రూ.23క్వింటాళ్ల నాసిరకం పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నా మార్పు రావడంలేదు.

కొన్ని కంపెనీలకు చెందిన విత్తనాల పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో వ్యాపారులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. పల్లెల్లో ఇది జోరుగా సాగుతోంది.

### అనుమతులు రద్దు చేస్తాం

-గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి.

గతంలో కంటే ఈసారి అధిక విస్తీర్ణంలో పత్తి, కంది పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. నాసిరకం విత్తనాలు విక్రయిస్తే వ్యాపారుల లైసెన్సును రద్దు చేస్తాం. ప్రస్తుతం 1.10లక్షల విత్తనాలు అందుబాటులో ఉంచాం. జిల్లాలోని నాలుగు డివిజన్లలో డివిజన్‌కు ఒకటి చొప్పున ఇంటర్నల్ స్క్వాడ్ బృందాలు కూడా పనిచేస్తున్నాయి. రైతులు సైతం మెలకువతో మెలగాలి.

# వర్షపు నీటినీ తాగొచ్చు



హైదరాబాద్: నగరంలో కురుస్తున్న వాన నీటిలో కొంతైనా భూమిలోకి ఇంకించినా.. ఫిల్టర్ చేసి వాడుకున్నా.. నగరవాసులకు నీటి కష్టాలే ఉండవు. నగరంలో సరాసరి వర్షపాతం 850 మిల్లీమీటర్లు. హెచ్ఎండీఏ పరిధిలో 7,200 చదరపు కిలోమీటర్ల మేరకు ఏటా కురుస్తున్న వాన నీళ్లు 15 టీఎంసీలకు సమానమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో 5శాతం కూడా భూమిలోకి ఇంకించడం, అవసరాలకు వాడుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఆలోచన ఉండాలనే కానీ.. ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసి పట్టవచ్చు. భూమిలోకి ఇంకించడమే కాకుండా.. ఫిల్టర్ చేసి వంటకు, తాగడానికీ వాడుకోవచ్చు. వాక్ ఫర్ వాటర్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.కరుణాకర్‌రెడ్డి కర్మన్‌ఘాట్‌లోని తన కార్యాలయంలో ఈ విధానాన్ని అమలు చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నగరంలో చాలామంది ఇలానే వాననీటితో లబ్ధిపొందుతున్నారని తెలిపారు.

### అతి తక్కువ ఖర్చుతోనే..

ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటి సంరక్షణకు అతి తక్కువ ఖర్చుతోనే ఏర్పాటు చేసుకోవచ్చు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లపై పడే వర్షపు నీటిని కిందికి పంపే పైపులకు సంపు ప్రాంతంలో చిన్న ఫిల్టర్ పెట్టి సంపులోకి మళ్లించాలి. ఫిల్టర్ ఖరీదు రూ.3 వేలతోపాటు ప్లంబర్ ఖర్చులు మాత్రమే చెల్లించాలి. వాన నీళ్లు అత్యంత స్వచ్ఛమైనవి. డాబాపై పడిన తర్వాత అందులోకి వ్యర్థాలు చేరుతాయి. వాటిని ఫిల్టర్ వడబోసి.. స్వచ్ఛమైన నీటిని సంపులోకి పంపుతుంది. తర్వాత సంపులో ఒకటి, రెండు క్లోరిన్ మాత్రలు కలిపి ఇంట్లో తాగడానికి, వంటకు ఉపయోగించవచ్చునని కరుణాకర్‌రెడ్డి తెలిపారు. తొలుత 5 నిమిషాలు వర్షపు నీటిని సంపులోకి కాకుండా బయటకు విడిచి పెట్టడంతో ఏదైనా చెత్త ఉంటే పూర్తిగా పోతుంది. తర్వాత సంపులోకి మళ్లించాలి.

### భారీగా వాన నీటి ఆదా..


ఏటా నగరంలో 850 మిల్లీమీటర్ల వరకు వాన కురుస్తుంది. ఈ లెక్కన ఒక చదరపు మీటరు స్థలంలో ఏటా 850లీటర్ల వర్షపు నీరు చేరుతుంది. అదే వెయ్యి చదరపు మీటర్ల ఇంటి పైకప్పుపై ఏటా 85వేల లీటర్ల వరకు వాన నీటిని ఆదా చేయవచ్చు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మణికొండ, నానక్‌రాంగూడ, గచ్చిబౌలి, మియాపూర్, కొండాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల్లో 33 వేల బోర్లు ఎండిపోయినట్లు జలమండలి గుర్తించింది. ఇందులో సగం ఇళ్లల్లో వర్షపు నీటి సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోలేదని గుర్తించింది.

### ఏడాదంతా బోర్లు ఎండకుండా..

- ఎం.కరుణాకర్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు, వాక్ ఫర్ వాటర్ సంస్థ

ఈ విధానంతో ఇళ్లు, కాలనీల్లో వర్షపు నీటిని ఆదా చేయచ్చు. పార్కులు, కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతలు తవ్వి వాన నీటిని వాటిలోకి మళ్లించడం ద్వారా బోర్లు ఇంకే పరిస్థితి ఉండదు. బోరుకు కొంత దూరంలో ఇంజక్షన్‌వెల్ తవ్వి అందులోకి ఈ విధానంలో వర్షపు నీటిని మళ్లించడం ద్వారా ఏడాది అంతా బోర్లు ఇంకిపోవు.

# ఔటర్ చుట్టూ.. ఔరా అనిపించేలా



రాష్ట్రంలో కొత్తగా ఐటీ సంస్థలు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం శరవేగంగా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఔటర్ చుట్టూ వాటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రభుత్వ భూములను సేకరించేందుకు రెవెన్యూ అధికారుల కసరత్తు చేస్తున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఔటర్‌కు సమీపంలోని కొన్ని ప్రాంతాలు, విమానాశ్రయానికి దగ్గరగా ఉండే మరికొన్ని ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. కృత్రిమమేధపై పరిశోధనలు పెంచేందుకు 200 ఎకరాల్లో ఏఐసీటీ, నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. వాటన్నింటికీ అవసరమైన ప్రభుత్వ భూములను సేకరించాలని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు సమాలోచనలు చేస్తున్నారు. గతంలో ఏవైనా సంస్థలు, పరిశ్రమలకు స్థలాలు ఇచ్చి అవి ఇంకా కార్యకలాపాలు ప్రారంభించకపోతే వాటిని వెనక్కి తీసుకునేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లనున్నారు.

### అన్నింటికీ అనుకూలంగా ఉండేలా...

ప్రభుత్వం కేటాయించే భూములు అన్నింటికీ అనుకూలంగా ఉండేలా రెవెన్యూ అధికారులు చూస్తున్నారు. శేరిలింగంపల్లి, మహేశ్వరం, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం మండలాల పరిధుల్లో స్థలాలను పరిశీలించారు. ఒక్కోచోట వెయ్యి ఎకరాలకు తక్కువ కాకుండా సేకరించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. దీంతోపాటు ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్) తరహాలో ఒకేచోట 300 ఎకరాల భూములు సేకరించాలని, పరిశ్రమలు, ఐటీ సంస్థలకు సమీపంలో ప్రభుత్వ స్థలాలను అభివృద్ధి చేస్తే అక్కడ నివాసం ఉండేందుకు వీలుంటుందని రెవెన్యూ అధికారుల భావిస్తున్నారు. ఇందుకోసం 300 గజాల చొప్పున ప్లాట్లుగా విభజించాలని నిర్ణయించారు. మిషన్ భగీరథ, జలమండలి అధికారులతో చర్చించి ఇళ్లు, ఆపార్ట్‌మెంట్ల నిర్మాణం ప్రారంభమైనప్పుడే తాగునీరు, మురుగు నీటి వ్యవస్థను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేయనున్నారు.

### ఫాక్స్‌కాన్... టెక్స్‌టైల్స్ హబ్ తరహాలో

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఫాక్స్‌కాన్ సంస్థ ఆపిల్ ఫోన్ విడిభాగాల తయారీ ప్లాంట్‌కు శ్రీకారం చుట్టింది. మహేశ్వరం మండలం తుక్కుగూడలో ఎలక్ట్రానిక్ సిటీ బాగా ప్రాచుర్యం పొందింది. ఈరెండు పరిశ్రమలతో పాటు షాబాద్ మండలంలో విద్యుత్ బస్సుల తయారీ, టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఇప్పటికే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఐటీ, పరిశ్రమల హబ్‌లో పరిశ్రమలు, ఐటీ సంస్థలతో పాటు వాటికి సమీపంలో విద్యా సంస్థలు, వినోద కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు, రెస్టారెంట్లను ప్రారంభిస్తే నాలుగైదేళ్లలోనే అక్కడ కూడా అభివృద్ధి పెరిగి మహానగరం తరహాలో అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు.

# ఏళ్ల తరబడి అపరిష్కృతం

గోదావరిఖని : ఎన్నికల ప్రచారంలో నాయకులు రాష్ట్ర, జాతీయ సమస్యలకే ప్రాధాన్యం ఇస్తుండటంతో స్థానిక అవసరాలు తీరడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పలు సమస్యలు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉంటున్నాయి. వాటిని నెరవేర్చడానికి ఇప్పటికైనా పాలకులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

### కలగానే భూతల ఓడరేవు

సుల్తానాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో భూతల ఓడరేవు(డ్రైపోర్టు) నిర్మాణానికి 2008లో కాంకర్(కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సర్వే నిర్వహించింది. 2009లో సాధ్యాసాధ్యాల నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఓవైపు రైల్వే ట్రాక్, మరోవైపు రాజీవ్ రహదారి, సమీపంలోనే బసంత్‌నగర్ విమానాశ్రయం ఉండటంతో కాంకర్ అధికారులు ఇక్కడే డ్రైపోర్టు కోసం యత్నాలు చేపట్టారు. వ్యవసాయ భూములను కోల్పోతామంటూ రైతులు ఆందోళనకు దిగడంతో కాంకర్ సంస్థ వెనుకడుగేసింది. ఇదే అదనుగా ఇతర జిల్లాల నాయకులు తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఆర్మూర్‌కు తరలించుకుపోయారు. అక్కడ కూడా పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా డ్రైపోర్టును తిరిగి తీసుకురాగలిగితే ఓడరేవుతో సంబంధం లేకుండా ఇక్కడి నుంచే ఇతర దేశాలకు ఎగుమతులు, దిగుమతులు చేసుకోవచ్చు. ఈ ప్రాంత అభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

### సర్వేకే పరిమితమైన రైల్వే లైన్

పెద్దపల్లి మండలం రాఘవాపూర్ మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు రామగుండం-మణుగూరు రైల్వే లైన్ నిర్మాణానికి 1999లో కేంద్రం సర్వే చేయించింది. దీనికి కోల్‌కారిడార్‌గా నామకరణం చేసింది. 2013-14లో రూ.10 కోట్ల నిధులు విడుదల చేయడంతో ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ఈ మార్గం ఆవశ్యకతను పేర్కొన్నారు. దీనికి సమాంతరంగా భద్రాచలం రోడ్డు-కొవ్వూరు రైలు మార్గానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపి గతేడాది రూ.20 కోట్లు విడుదల చేసింది. కోల్‌కారిడార్ ద్వారా సింగరేణి ప్రాంతాల అనుసంధానంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధికి బాటలు పడతాయి. రైల్వే శాఖ ప్రతిపాదించిన ఈ మార్గంలో ప్రాథమికంగా మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాల్‌రావుపేటల్లో స్టేషన్లను గుర్తించారు. 197 కిలోమీటర్లు కలిగిన ఈ మార్గం పూర్తయ్యే నాటికి కొవ్వూరు మార్గం కూడా పూర్తయ్యే అవకాశముంటుంది. ఈ రెండు మార్గాలు పూర్తయితే రామగుండం నుంచి విశాఖపట్టణానికి రవాణా మార్గం అందుబాటులోకి వస్తుంది. మణుగూరు నుంచి భద్రాచలం రోడ్డుకు ఇప్పటికే కోల్ రవాణా ట్రాక్ ఉంది.

### కార్మికులకు కలగానే ఐటీ మినహాయింపు

సింగరేణి కార్మికుల చిరకాల స్వప్నం ఆదాయ పన్ను మినహాయింపు. ప్రమాదకర పరిస్థితుల్లో బొగ్గు ఉత్పత్తి విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఐటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని చాలా ఏళ్లుగా కోరుతున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇస్తున్నా నెరవేరడం లేదు.

### జాతీయ రహదారి లేని జిల్లాకేంద్రం

పెద్దపల్లి జిల్లాకు ఇప్పటివరకు ఒక్క జాతీయ రహదారితోనూ అనుసంధానం లేదు. మంచిర్యాల నుంచి వరంగల్ మీదుగా ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ ప్రక్రియ భూసేకరణ దశలో ఉండగా, జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలనే ప్రతిపాదన ఉంది. ప్రధానమైన రాజీవ్ రహదారి(ఎస్‌హెచ్-1), రాయపట్నం రోడ్డు(ఎస్‌హెచ్-7) రాష్ట్ర రహదారులు కాగా ఎన్‌హెచ్ ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పైవంతెనలు, పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో సర్వీసు రోడ్లు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### ప్రశ్నార్థకంగా కొత్త గనులు

సింగరేణి విస్తరించి ఉన్న ఆరు జిల్లాల పరిధిలో బొగ్గు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నా కొత్త గనులు ఏర్పాటు చేసుకోవాలంటే వేలంలో పాల్గొనక తప్పదు. ఈ మేరకు కేంద్రం మూడేళ్ల కిందట ఎంఎండీఆర్(ది మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్) చట్టం తీసుకొచ్చింది. నిక్షేపాల అన్వేషణతో పాటు గనుల ఏర్పాటుకు అవసరమైన ప్లానింగ్ పూర్తి చేసి, నివేదికలు సిద్ధం చేసుకున్న సింగరేణికి కేటాయింపులు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండటం నిరాశకు గురి చేస్తోంది. కొత్త చట్టం ప్రకారం దేశంలో ఎక్కడి బొగ్గు గనినైనా వేలం ద్వారానే పొందాల్సి ఉంటుంది. దీంతో సింగరేణికి ప్రస్తుతం కొత్త గనులు లేక విస్తరణ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటివరకు కేంద్రం నిర్వహించిన వేలంలో ఈ ప్రాంతంలోని నాలుగు గనులను చేర్చారు. అందులో ఒక గనికి ప్రైవేటు సంస్థ బిడ్డింగ్ వేయడంతో దానికే కేటాయించారు.

# రైతుల కల నెరవేరేదెన్నడో..?

ఎల్లారెడ్డిపేట : మెట్ట ప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గొట్టపుబావులు, బావులే వ్యవసాయానికి ప్రధాన ఆధారం. సాగునీటి కొరత నెలకొనడం ఈ ప్రాంతంలో సర్వసాధారణం. ఎగువ మానేరుకు పునరుజ్జీవం పోసే కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. సుమారు 86 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు 16 ఏళ్లుగా కొన'సాగు'తూనే ఉన్నాయి. అక్కడక్కడ భూసేకరణలో అడ్డంకులు ఎదురవుతుండగా మరికొన్ని చోట్ల పనులు నత్తను తలపిస్తున్నాయి. దీంతో రైతుల సుదీర్ఘ కల నెరవేరేదెన్నడో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పనులను వేగవంతం చేయడం ద్వారా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేస్తేనే అన్నదాతలకు మేలు చేకూరనుంది. కరవు నేల సస్యశ్యామలం కానుంది.

### మల్కపేట వరకు పూర్తి

ఎగువ మానేరు కింద ఉన్న 26 వేల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణతోపాటు కొత్తగా 60 వేల ఎకరాలు కలుపుకొని మొత్తం 86 వేల ఎకరాలకు సాగునీటిని అందించడమే లక్ష్యంతో 2008లో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపుగా మరో 60 వరకు గొలుసుకట్టు చెరువులు జలకళను సంతరించుకునేలా ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు. మధ్యమానేరు నుంచి ఎగువ మానేరు వరకు 9వ ప్యాకేజీ కింద రూ.996 కోట్లు, మల్కపేట రిజర్వాయర్ నిర్మాణానికి రూ.543 కోట్లతో అంచనాలు రూపొందించారు. మధ్యమానేరు నుంచి రగుడు బైపాస్ రోడ్డు వద్ద 12 కిలోమీటర్ల టన్నెల్ (సొరంగమార్గం), ఆ తర్వాత మల్కపేటలో సర్జిపూల్, పంప్‌హౌస్ నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండు మోటర్లతో 3 టీఎంసీ సామర్థ్యంగల మల్కపేట రిజర్వాయర్‌లో గతంలో 1 టీఎంసీ నీటిని నింపారు.

### సింగసముద్రం చెరువు ఆధునికీకరణ

నైజాం కాలంలో నిర్మించిన సింగసముద్రం చెరువు గతంలో ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. వచ్చే అరకొర నిధులతో కొంతమేర పనులు చేసినా ఫలితం లేకుండా పోయింది. కాళేశ్వరం 9వ ప్యాకేజీ పథకంలో ఆ చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఆధునీకరించారు. మత్తడిని 33 మీటర్ల ఎత్తుకు పెంచారు. పాతమత్తడి, బందీస్(పురాతన ఆనకట్ట)లకు స్కిన్‌వాల్ నిర్మించారు. కట్టను మూడు మీటర్ల ఎత్తుకు పెంచి ఆరు మీటర్ల వెడల్పు చేశారు. పథకం పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం పెరగడంతోపాటు దాదాపు ఏడు గ్రామాలు జలకళ సంతరించుకుంటాయి.

ఈ పనులు ప్రధానంమల్కపేట నుంచి సింగసముద్రం చెరువు వరకు కాల్వ నిర్మాణంలో 18.3 కిలోమీటర్ల దూరానికి గాను మధ్యలో బ్రిడ్జిల వద్ద 200 మీటర్ల లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయిసింగసముద్రం చెరువు నుంచి గంభీరావుపేట మండలంలోని ముస్తఫానగర్ బట్టల చెరువు వరకు 5.6 కిలోమీటర్ల మే పైపులైన్ వేశారు. పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తే పైపులైన్ ద్వారా బట్టల చెరువులోకి నీరు చేరుతుంది.మల్కపేట నుంచి సింగసముద్రం వరకు ప్రధాన కాల్వ మధ్యలో అయిదు ఉపకాల్వ (డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్)ల నిర్మాణాలు భూసేకరణ సమస్యతో నిలిచిపోయాయి.




## కేన్స్‌లో ఇండియన్ షార్ట్ ఫిల్మ్‌కు మొదటి బహుమతి.. పేరేంటంటే

కేన్స్-2024లో ఉత్తమ లఘు చిత్రంగా ఇండియన్ షార్ట్ ఫిల్మ్ బహుమతి సొంతం చేసుకుంది. చిదానంద తెరకెక్కించిన 'సన్‌ఫ్లవర్స్ వర్ ద ఫస్ట్ వన్ టు నో' ఈ ఘనత సాధించింది. వివిధ భాషలకు చెందిన 17 చిత్రాలతో పోటీ పడి తొలి స్థానంలో నిలవడంతో నెటిజన్లు ఈ టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతున్నారు. 16 నిమిషాల నిడివి ఉన్న ఈ షార్ట్ ఫిల్మ్‌ను ఓ కన్నడ జానపద కథ ఆధారంగా రూపొందించారు. వృద్ధురాలి కోడిని ఎవరో దొంగలించడం.. దానిని కనుగొనడం కోసం ఆమె పడే తపనను ఇందులో చూపారు. ఇప్పుడీ షార్ట్ ఫిల్మ్ హాలీవుడ్‌తో పోటీ పడి మొదటి బహుమతి గెలుచుకోవడంపై చిత్ర బృందం హర్షం వ్యక్తం చేసింది. ఇక మేరఠ్‌లో జన్మించిన భారతీయ చిత్రనిర్మాత మహేశ్వరి రూపొందించిన యానిమేటెడ్ చిత్రం 'బన్నీ హుడ్' ఈ పోటీలో తృతీయ బహుమతి గెలుచుకోవడం విశేషం. మే 23న బునుయెల్ థియేటర్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఉత్తమ లఘు చిత్రానికి 15,000 యూరోలు, తృతీయ స్థానానికి 7,500 యూరోలు అందించారు. ఫ్రాన్స్ వేదికగా 77వ కేన్స్?ఫిల్మ్ ఫెస్టివల్ ఘనంగా జరుగుతోంది. మే 14 నుంచి 25వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలో తాజాగా మంచు విష్ణు హీరోగా తెరకెక్కుతున్న తెలుగు చిత్రం 'కన్నప్ప' టీజర్‌ను కూడా ప్రదర్శించారు. దీనిపై మంచు విష్ణు సంతోషం వ్యక్తం చేశారు. అక్కడకు వచ్చిన అతిథులకు ఈ టీజర్ నచ్చిందని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.



## భక్తులకు గుడ్ న్యూస్.. స్వామి వారి సేవలు ఇకపై ఆన్‌లైన్‌లో..

యాదాద్రి భక్తులకు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఉన్నతాధికారులు గుడ్ న్యూస్ చెప్పారు. స్వామి వారి దర్శనంతోపాటు ఆర్జిత సేవలు ఇకపై ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని భక్తులకు తెలిపారు. స్వామి వారిని దర్శించుకొనేందుకు నిత్యం లక్షలాది మంది భక్తులు యాదాద్రికి తరలి వస్తున్నారని... ఈ నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు దేవస్థానం ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఆ క్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం తీసుకు వచ్చిన సౌకర్యాలన్నీ యాదాద్రిలో తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అందులోభాగంగానే ఆన్‌లైన్ సేవలు తీసుకు వచ్చామని వివరించారు. ఆన్‌లైన్‌లో yadadritemple.telangana.gov.in. వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. టికెట్లు బుక్ చేసుకోవచ్చని భక్తులకు సూచించారు. ఇక ఇదే వెబ్‌సైట్ నుంచి ఈ హుండీకి విరాళాలు ఇవ్వ వచ్చునని భక్తులకు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా గంట ముందు స్వామి వారి దర్శనం, పూజ కైంకర్యాలకు బుక్ చేసుకో వచ్చని యాదాద్రి దేవస్థానం ఉన్నతాధికారులు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యంత మహిమాన్విత పుణ్య క్షేత్రాలు చాలానే ఉన్నాయి. వాటిలో యాదాద్రి ఒకటి. యాదగిరిగుట్టలో కొలువు తీరిన శ్రీలక్ష్మీనరసింహస్వామి.. భక్తుల కోరిన కోరికలు తీరుస్తాడని ప్రజలు బలంగా నమ్ముతారు.

మరోవైపు ఆ ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. ఆ క్రమంలో యాదగిరిగట్టు కాస్తా యాదాద్రిగా మారింది. తిరుమల తరహాలోనే యాదాద్రిలో ఆలయ నిర్మాణం చేపట్టారు. దీంతో మాఢ వీధులు, స్వామి వారి పూజా కైంకర్యాలు, ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాలు, ప్రసాదాలతో యాదాద్రి.. తెలంగాణ తిరుమలగా రూపుదిద్దుకొంది. ఇంకోవైపు వీఐపీ, వీవీఐపీలు, సిఫార్సులపై వచ్చే భక్తులకు రూ.300 టికెట్ ద్వారా బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారు. రూ. 150 చెల్లించి శీఘ్ర దర్శనం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉంది. కానీ అన్ని సేవలను ఇకపై ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు యాదాద్రి దేవస్థానం ఉన్నతాధికారులు తెలిపారు.

## విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం కీలక ప్రకటన

విశాఖపట్నం: ఎండలు మండిపోతున్న వేళ విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం చల్లటి కబురు చెప్పింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది క్రమంగా బలపడి తీవ్రవాయుగుండంగా.. ఆ తర్వాత తుపానుగా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇది ఈశాన్య దిశగా పయనిస్తుందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం పేర్కొంది. ఇది క్రమంగా బలపడి తుపానుగా ఈనెల 26వ తేదీ రాత్రికి బర్మా సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ తుపాను ప్రభావంతో ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో పలుచోట్ల సాధారణం నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఈ తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్ మీద పెద్దగా ఉండదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం పేర్కొంది. కాగా ప్రస్తుతం ఉత్తర కోస్తా జిల్లాల్లో అక్కడక్కడా చెదురు మదురుగా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రంలో మిగతా జిల్లాలలో ఎండల తీవ్రత కొనసాగుతోందని, రెండు రోజుల తర్వాత పొడిగాలుల తీవ్రత కూడా ఉ




ఉంటుందని హెచ్చరించింది. ప్రస్తుతం అన్ని పోర్టులకు ఒకటో నెంబర్ హెచ్చరిక కొనసాగుతోందని, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారిణి సునంద వెల్లడించారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194





## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. జూన్ 2న జరిపే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ఈసీ అనుమతితో సీఎస్ శాంతకుమారి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ఈ నేపథ్యంలో జూన్ రెండవ తేదీ కార్యక్రమానికి ముందు సీఎం రేవంత్ రెడ్డి గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించనున్నారు. గన్ పార్క్ కార్యక్రమం తర్వాత ముఖ్యమంత్రి పరేడ్ గ్రౌండ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొననున్నారు. జూన్ 2న జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని ఆహ్వానించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించిన పదేళ్ల తర్వాత తొలిసారిగా సోనియా గాంధీ ఈ బహిరంగ సభలో పాల్గొననున్నారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంశం, పంట రుణాల మాఫీని తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు 2024 పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఇటీవల ఎన్నికల సంఘం తెలిపింది. దీంతోపాటు ఎన్నికల నిర్వహణలో ప్రమేయం ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అధికారిని సమావేశానికి పిలవవద్దని ఈసీ ఆదేశించింది. దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో అనేక ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది.

ఈ క్రమంలో ఏదైనా కొత్త ప్రభుత్వ పథకాలు అమలు చేయాలంటే ఎన్నికల సంఘం అనుమతి తప్పక తీసుకోవాల్సిందే.

## వడ్లకు బోనస్ ఇవ్వాలి.. లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం

ఖమ్మం జిల్లా: అన్ని రకాల వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ప్రకటించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సన్నవడ్లు, దొడ్డు వడ్లని కాకుండా అన్నిరకాల వడ్లకు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఖమ్మం జిల్లాలో రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. జీలుగు విత్తనాలు ఇవ్వడం లేదని హరీష్ రావుకు రైతులు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్బంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతుల ఫోన్ నుంచి తల్లాడ ఏవోకు ఫోన్ చేసి మాట్లాడారు. రైతులకు జీలుగు విత్తనాలు ఎందుకు ఇవ్వడం లేదంటూ ఏవోను హరీష్ రావు ప్రశ్నించారు. రైతులకు రేపటి నుంచి జీలుగు విత్తనాలు సరఫరా చేస్తామని ఏవో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో అధికారంలోకి వచ్చిందన్నారు.



రైతులకు ఇస్తానన్న రుణమాఫీ నేటికీ ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ధాన్యానికి ఇస్తానన్న బోనస్ నేటికీ అమలు కాలేదన్నారు. రేవంత్ ప్రభుత్వం బోనస్ అమలు చేయకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రైతులతో కలసి అసెంబ్లీ ముట్టడిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

## రైతులను కాంగ్రెస్ సర్కార్ దగా చేసింది



నల్గొండ: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం నకిరేకల్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నకిరేకల్‌కు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. రుణ మాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి రైతులను దగా చేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 2,683 రూపాయల మద్దతు ధర ఇస్తామని ప్రకటన చేశారు. సన్న వడ్లకు మాత్రమే ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నారని వివరించారు. వడ్ల విషయంలోనే కాదు ప్రతీ అంశంలో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. కరెంట్ విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. తమ హయాంలో కరెంటు సమస్య ఎలా ఉండెదో గుర్తుచేసుకోవాలని సూచించారు. ఇప్పుడు కరెంట్ కష్టాలతో రైతులకు ఇబ్బందికర పరిస్థితులు వస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అని ఊదరగొట్టారు. అందులో ఇప్పటివరకు ఒక్కటే అమలు చేశారని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్క నోటిఫికేషన్ రాలేదని కేటీఆర్ విమర్శించారు. నోటిఫికేషన్ రాలేదు.. గాడిద గుడ్డు వచ్చిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన 30 వేల ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిందని గొప్పలు చెప్పుకుంటుదని విరుచుకుపడ్డారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ నేతల సయోధ్య ఉండదని.. ఇక్కడ ఆ పార్టీ నేతల ఎవరి విధానాలు వారివే ఉంటాయని కేటీఆర్ ఆరోపించారు.

## వాజ్‌పేయ్ లాగానే కిషన్‌రెడ్డిలో ఆ లక్షణం ఉంది

హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్‌గా కిషన్‌రెడ్డి మారారని పొగడ్తలు కురింపించారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలను సంతోషంగా స్వాగతిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ పాలన బాగుందని కిషన్ రెడ్డి ఒప్పుకున్నందుకు సంతోషమని ప్రశంసించారు. గాంధీభవన్‌లో కిషన్‌రెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కిషన్ రెడ్డికి వ్యవసాయ శాఖపై ఎలాంటి అవగాహన లేదని చెప్పారు. ధాన్యం మద్దతు ధర కేంద్రం నిర్ణయిస్తుందనే కనీస అవగాహన కిషన్ రెడ్డికి లేదన్నారు. 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని కిషన్ రెడ్డి అన్నారన్నారు. ప్రభుత్వ పాలన నచ్చే 25 మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని కిషన్ రెడ్డి ఒప్పుకున్నారని చెప్పారు. దివంగత ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయ్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వ్యక్తి కిషన్ రెడ్డి అని కొనియాడారు. అధికార పార్టీలు మంచి చేస్తే మెచ్చుకునే గుణం వాజ్‌పేయ్ లాగే కిషన్ రెడ్డికి వచ్చిందన్నారు. ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టలేరన్నారు. ఎన్ని ప్రయోగాలు చేసిన బీజేపీకి తెలంగాణలో స్థానం లేదన్నారు. మోదీ ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రం బట్టలు, టోపీలు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదని జగ్గారెడ్డి తెలిపారు.



## మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై కేసు నమోదు.. ఎందుకంటే..?

చేవెళ్ల: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, అతని కుటుంబ సభ్యులపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జీవన్‌రెడ్డి తన భూమిని కబ్జా చేశారని చేవెళ్ల పీఎస్‌లో దామోదర్ రెడ్డి అనే వ్యక్తి ఈరోజు (శుక్రవారం) కేసు నమోదు చేశారు. ఎర్లపల్లిలో 20 ఎకరాల 20 గుంటల భూమిని 2022లో కొనుగోలు చేశానని బాధితుడు చెబుతున్నాడు. అయితే సర్వేనెంబర్ 32, 35, 36, 38లో ఓ ఫంక్షన్ హాల్‌ను గతంలో నిర్మించుకున్నానని, తన భూమి పక్కనే జీవన్ రెడ్డి భూమి ఉందని చెప్పాడు. 2023లో ఫంక్షన్ హాల్‌ని పడగొట్టి జీవన్‌రెడ్డి తన భూమిని కబ్జా చేశాడని సదరు బాధితుడు ఆరోపిస్తున్నాడు. కబ్జా చేసిన భూమికి రక్షణగా పంజాబ్ గ్యాంగ్‌ను జీవన్ రెడ్డి పెట్టి తనను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన భూమిని తనకు ఇవ్వాలని అడిగితే పంజాబ్ గ్యాంగ్‌తో మారణాయుధాలతో దాడి చేసి భయాభ్రాంతులకు గురి చేశారని సదరు బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. తన భూమిని జీవన్‌రెడ్డి నుంచి విడిపించాలని చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. తనకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, జీవన్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని సదరు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులపై 447, 427, 341, 386, 420, 506 %తీ/ష% 34 ఐపీసీ (ఆరు సెక్షన్ల కింద) పోలీసులు కేసు నమోదు చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660